క్లుప్తంగా

వాహన తనిఖీలు



డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న ఎస్సై అమ్మన్నరావు

సీతంపేట: మండలంలోని కిట్టాలపాడు జంక్షన్ వద్ద ఎస్సై వై. అమ్మన్నరావు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి అపరాధ రుసుం విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపితే బైక్ యజమానులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

గరుగుబిల్లి: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పి.వెంకటరత్నం మాట్లాడుతూ విజ్ఞానం పెంపొందించేందుకు గ్రంథాలయాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనంను అలవర్చుకోవాలన్నారు. గ్రంథాలయాల ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. అనంతరం క్విజ్ పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ మాధవి, శాఖాగ్రంథాలయ నిర్వాహకుడు ఎస్.మధుసూదనరావు, తదితరులున్నారు.

వనసమారాధన



వనసమారాధనలో ఆటలాడుతున్న చిన్నారులు

గుమ్మలక్ష్మీపురం: ఏజెన్సీ ప్రాంతంలో కార్తీక వనసమారాధనలు ప్రారంభమయ్యాయి. కురుపాం మండలం పి.లేవిడి గ్రామ సమీపంలోని రబ్బరు తోటలో ఆదివారం గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన కాపు సంఘం వనసమారాధన నిర్వహించారు. చిన్నారులు, పెద్దలు అంతా కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఆటపాటలతో రోజంతా ఆనందంగా గడిపారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

బలిజిపేట: చిలకలపల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం రోహిణీ నక్షత్రం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు కె.రాంబాబు స్వామివారిని తులసీ దళాలు, పూలతో అలంకరించారు. భక్తులు అందించిన పూజాద్రవ్యాలు, దూప, దీప, నైవేద్యాలతో స్వామివారికి ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

అన్నసమారాధన

మక్కువ: మండల కేంద్రం మక్కువలోని నాయుడువీధిలో ఆదివారం అయ్యప్పస్వామి మాలధారణ భక్తులు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప భక్తులు ముందుగా సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆచరించారు. పూజా కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

వాహన పత్రాల పరిశీలన

మక్కువ: మండల కేంద్రంలో మక్కువ, దుగ్గేరు, శంబర గ్రామాల కూడలి వద్ద ఎస్సై వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఏజెన్సీ గ్రామాల నుంచి రాకపోకలు సాగించే ప్రతీ వాహనాన్ని నిలిపి క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన వాహన పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసం విధించారు. రహదారి భద్రత నిబంధనలపై వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి, లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదని సూచించారు.


ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తగదు

పార్వతీపురం: విద్యుత్ వినియోగదారులకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించడం హేయమైన చర్య అని ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మీనాయుడు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దశల వారీగా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసి రెండు కోట్లమంది వినియోగదారులపై భారం మోపేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు.

నేడు కుంబిడి యాత్ర..



భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేసిన బారికేడ్లు



(ఇన్‌సెట్లో) కుంబిడిలో వెలిసిన కుంభేశ్వరుడు

- ప్రతి ఏడాదీ కార్తీకమాసం మూడో సోమవారం సందడే సందడి
- అధిక సంఖ్యలో తరలిరానున్న భక్తులు
- జాతరకు ముమ్మర ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

వీరఘట్టం: మండలంలోని కుంబిడి – ఇచ్ఛాపురం గిరిజన గ్రామంలో కార్తీక మూడో సోమవారం జరగనున్న కుంభేశ్వరుని (ఉమా మహేశ్వరస్వామి) యాత్రకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం బారికేడ్లను ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా కుంబిడి యాత్రకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అశేషంగా భక్తులు వచ్చి ఆ మహాశివున్ని దర్శించుకుంటారు. ఈ ఏడాది స్వామి వారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. అలాగే భక్తులకు అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేయనున్నారు.

ఇదీ కుంబిడి ప్రత్యేకత...

కార్తీకమాసం మూడో సోమవారం కుంబిడిలో వెలసిన కుంభేశ్వరునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి రోజంతా అక్కడే గడిపి వన భోజనాలు చేసి సాయంత్రం తిరిగి రావడం ఆనవాయితీగా వస్తోంది. ఒక్క ఈ మండలమే కాకుండా పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలోని వంగర, పాలకొండ, రేగిడి, సీతంపేట, జియ్యమ్మవలస, గరుగుబిల్లి, పార్వతీపురం, తదితర మండలాల నుంచి తండోపతండాలుగా భక్తులు వస్తారు. ఈ ప్రాంతంలో ఇదే పెద్ద జాతర కావడం విశేషం.

ఇదీ నేపథ్యం..

పూర్వం దట్టమైన అటవీ ప్రాంతంలో (కుంబి ఇచ్ఛాపురం) అనాగరికంగా జీవించే గిరిజనులు వేటకు వెళ్లినప్పుడు శివలింగం వారికి తారసపడింది. ఏదో కొండదేవత విగ్రహం అనుకొని దానికి పూజలు, జంతుబలులు చేసేవారని పూర్వీకుల సమాచారం. ఒకనాడు వీరఘట్టానికి చెందిన శీలా సోమలింగం అనే వ్యక్తి ఆ గిరిజన గ్రామానికి యాచనకు వెళ్లినప్పుడు గిరిజనులు శివలింగానికి జంతు బలులుతో పూజలు చేయడం చూసి జంతుబలులు ఇవ్వడం తప్పని చెప్పినట్లు కథనం. శివలింగానికి పువ్వులు, పసుపు, కుంకుమలతో నిత్యం పూజలు చేయాలని వారికి సూచించడంతో అప్పటి నుంచి సంప్రదాయ పూజలు జరుగుతున్నాయి. కాలక్రమంలో ఆ శివలింగాన్ని కుంభేశ్వరుడిగా పిలుచుకుంటూ పూజలు చేస్తున్నారు. అలాగే ఎండల మల్లేశ్వరుడిగా కూడా పిలుస్తుంటారు.

పవిత్రతను కాపాడండి...

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కుంబిడి పవిత్రను కాపాడాలని ఎస్సై జి. కళాధర్ కోరారు. యాత్రా ప్రాంగణాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ ప్రాంతంలో మద్యం, మాంసం విక్రయాలు చేపట్టరాదని సూచించారు. ఎవరైనా ఆలయ పవిత్రతకు భంగం కలిగిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పామాయిల్ సాగుకు ముందుకు రావాలి

- హెచ్‌టీఓ జయశ్రీ



లివిరిలో నాటిన పామాయిల్ మొక్కలను పరిశీలిస్తున్న హెచ్‌టీఓ పేడాడ జయశ్రీ

భామిని: సుమారు 30 ఏళ్ల నిరంతరం ఆదాయం వచ్చే పామాయిల్ (ఆయిల్ పామ్) సాగుకు రైతులు ముందుకు రావాలని హార్టికల్చర్ ఆఫీసర్ (సీతంపేట) పేడాడ జయశ్రీ పిలుపునిచ్చారు. ఆయిల్‌పామ్ సాగు చేయాలనుకునే రైతులకు శ్రీనివాస ఆయిల్‌పామ్ కంపెనీ వారు మొక్కలు అందిస్తారన్నారు. పామాయిల్‌లో అంతర పంటలు కూడా సాగు చేసుకోవచ్చని చెప్పారు. లివిరిలో నాటిన పామాయిల్ మొక్కలను ఆదివారం పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణనాయుడు

వీరఘట్టం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ డి.వెంకటరమణనాయుడు ఆధ్వర్యంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభం కావాల్సిన సర్వసభ్య సమావేశం సభ్యుల కోరం లేకపోవడంతో సుమారు గంటన్నర ఆలస్యంగా 3.20 గంటలకు ప్రారంభమైంది. మండల వ్యవసాయ శాఖకు సంబంధించి వ్యవసాయాధికారి జె.సౌజన్య మాట్లాడుతుండగా.. తూడి గ్రామ సర్పంచ్ కె.వెంకటరమణ అడ్డుతగిలి గతేడాది ధాన్యం కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. తూడి రైతుభరోసా కేంద్రంలో ఒక్క ట్రక్‌షీట్ కూడా కోయలేదన్నారు. ఈ ఏడాది ఆ పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామీణ నీటి సరఫరా విభాగానికి సంబంధించి ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ డి.కావ్యశ్రీ మాట్లాతుండగా.. నీలానగరం సర్పంచ్ వావిలపల్లి పురుషోత్తం నాయుడు కల్పించుకుని తమ గ్రామంలో 50 శాతం మందికి తాగునీరు అందడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. చలివేంద్రి ఎంపీటీసీ సభ్యుడు పోరెడ్డి వెంకటనాయుడు మాట్లాడుతూ.. గ్రామంలో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రక్షిత మంచినీటి పథకం పని చేయలేదన్నారు. సభ్యుల ప్రశ్నలతో మండల సమావేవం వాడీవేడిగా సాగింది. సమావేశంలో ఎంపీడీఓ వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీలు పత్రి విజయకుమారి, విశ్వసరాయి భార్గవ్, తదితరులు పాల్గొన్నారు

బాబా మందిరంలో ప్రత్యేక పూజలు



హోమ పూజల్లో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, నిత్య పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ పర్యవేక్షణలో అర్చకులు ఎస్.శ్రీనివాసరావు, రఘుశాస్త్రి ఆధ్వర్యంలో జై గురుదత్త హోమం, శ్రీచక్ర అర్చనలు, మహాలింగార్చన, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పార్వతీపురం, వీరఘట్టం, హిరమండలం, కొత్తూరు, గరుగుబిల్లి, బీవీపురం, తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



కొత్తవలసలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: గ్రంథాలయాలను యువత, విద్యార్థులు సద్వినియోగించుకోవాలని మోసెస్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఇబ్రహీం మొహమ్మద్, వలీ అన్నారు. మండలంలోని నెల్లికిక్కువ, కొత్తవలస గ్రామాల్లో మోసెస్ వెల్ఫేర్ సొసైటీ సహకారంతో యస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయం వద్ద సాధారణ పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, కూర్చొని చదువుకునేందుకు కావాల్సిన ఫర్నిచర్‌ను సమకూర్చినట్లు చెప్పారు. యువత వాటిని సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నెల్లికిక్కువ గ్రామ పెద్ద సోములు, దుడ్డుఖల్లు సర్పంచ్ నిమ్మక నీలావతి, బీజేపీ నాయకులు నిమ్మక సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా..

పాలకొండ: పాలకొండ మండల సమావేశం వాయిదా పడింది. ఆదివారం సమావేశం నిర్వహించాల్సి ఉండగా.. సభ్యులు హాజరుకాకపోవడంతో కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీఓ విజయరంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పాలిథిన్ ఉత్పత్తులు వినియోగిస్తే చర్యలు

పాలకొండ: నగర పంచాయతీలో పాలిథిన్ ఉత్పత్లుఉ వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావు స్పష్టం చేశారు. పట్టణంలోని పలు షాపుల్లో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. పాలిథిన్ కవర్లు వినియోగిస్తున్న వ్యాపారులకు అపరాధ రుసుం విధించారు. మరికొంతమందికి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ.. పట్టణంలో పాలిథిన్ నిషేధం కొనసాగుతోందన్నారు. ఇందుకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

నిబంధనలు పాటించాలి..

పాలకొండ రూరల్: వాహనదారులు తప్పకుండా రహదారి నిబంధనలు పాటించాలని ఎస్సై ప్రయోగమూర్తి అన్నారు. పాలకొండ – సీతంపేట రోడ్డులో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమాన విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్యం మత్తులో వాహనాలు నడపరాదని సూచించారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

సీతంపేట: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం స్థానిక హైస్కూల్‌లో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మాదకద్రవ్యాల ప్రభావం అనే అంశంపై పోటీలు నిర్వహించగా.. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని చిత్రాలు వేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ బబ్బురు గణేష్, హెచ్‌ఎం వై.హేమసుందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆడిట్‌కు రంగం సిద్ధం

సీతంపేట: ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్‌కు రంగం సిద్ధమైంది. ఈ మేరకు 13 మంది డీఆర్‌పీ, ఎస్‌ఆర్‌పీలు మండలానికి చేరుకున్నారు. స్థానిక ఎంఎంఎస్‌లో ఉపాధి సిబ్బందితో సోమవారం సమావేశం కానున్నారు. మండలంలో రూ.35.16 కోట్లతో జరిగిన ఉపాధి పనులు పరిశీలించనున్నారు.

గోగు రైతులను ఆదుకోవాలి

సీతానగరం: జనపనార ఆధారిత వస్తువుల తయారీకి ప్రభుత్వం చేయూత ఇవ్వడం ద్వారా గోగు సాగును ప్రోత్సహించాలని గోగు రైతులు కోరుతున్నారు. మండలంలోని గాదెలవలస, జానుమల్లువలస, ఎస్.ఎస్.పురం, కె.ఎస్.పురం, దయానిధిపురం, జయంతిరాయపురం, చినంకలాం, తదితర గ్రామాల్లో గోగు పంట సాగు చేస్తున్నారు. పంటకోత అనంతరం నార తీసేందుకు చెరువుల్లో ఊర వేయాల్సి ఉంటుంది. అయితే ఆయా గ్రామాల్లోని చెరువుల్లో నీరు లేకపోవడం, గోగుసాగుకు మద్దతు ధర రాకపోవడంతో రైతులు ఈ పంట సాగుకు ఆసక్తి చూపడం లేదు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

గరుగుబిల్లి:

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఉపాధ్యక్షుడు డి.పారినాయుడు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని తోటపల్లిలో జట్టు ట్రస్టు కార్యాలయంలో ఉన్న గరిమెళ్ల నారాయణ స్మారక గ్రంథాలయంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయ విధానాలు తెలిపే పలు పుస్తకాలను పాఠకులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పారినాయుడు మాట్లాడుతూ విజ్ఞానాన్ని పెంచేవి గ్రంథాలయాలు మాత్రమే అన్నారు. గ్రంథాలయ ఉద్యమకారుల సేవలను గుర్తుచేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నేటి తరానికి మొబైల్స్ వాడడం ఒక బలహీనతగా మారిందన్నారు. మొబైల్ నుంచి పిల్లలను దూరం చేసేందుకు పుస్తక పఠనం అలవాటు చేయాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంఘ అధ్యక్షుడు టి.శివకేశవరావు మాట్లాడుతూ గ్రంథాలయాలను వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. 'బడి నుంచి పొలం బడికి' కార్యక్రమం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా పలువురు ప్రకృతి సేద్యం చేసిన రైతులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో రచయిత తుంబలి శివాజీ, ఎస్‌ఎఫ్‌ఏ తిరుపతిరావు, శారద, అన్నపూర్ణ, ముసలి నాయుడు తదితరులు ఉన్నారు.



జ్ఞాపికలను అందజేస్తున్న గ్రంథాలయ సంస్థ ఉపాధ్యక్షుడు పారినాయుడు, తదితరులు

నగర సంకీర్తన..



పాలకొండ నగర పంచాయతీలోని సత్యసాయి మందిరం సభ్యులు ఆదివారం పట్టణంలో మహా నగర సంకీర్తన నిర్వహించారు. ప్రధాన వీధుల మీదుగా సాగిన నగర సంకీర్తనలో భక్తులు సత్యసాయి పాటలు పాడడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

- పాలకొండ

సమయపాలన పాటించాలి



ఆర్టీసీ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం స్థానిక డిపో ఆవరణలో సమయపాలన మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 16 నుంచి డిసెంబర్ 16 వరకు సమయపాలన మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలని.. బస్టాండ్‌లో సమయానికి బస్సులు ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ మేనేజర్ ఎస్. లక్ష్మణరావు, ఏఎంఎఫ్ జగన్నాథం, మూర్తి, అన్ని యూనియన్ల నాయకులు పాల్గొన్నారు. – పాలకొండ

భక్తిశ్రద్ధలతో అక్షర హోమం..



భామిని మండల పరిధి నూకాలమ్మ గూడలోని అక్షరబ్రహ్మ ఆశ్రమంలో దీక్షా ముగింపు పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ గిరిజనులకు అక్షర జ్ఞానం అందించిన అక్షరబ్రహ్మ ఆశీస్సుల కోసం దీక్ష చేపట్టిన భక్తులు దీక్ష విరమించి ప్రత్యేక హోమం చేశారు. యువ నిర్మాణ సేన జిల్లా కో ఆర్డినేటర్ సవర కరువయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భామిని, సీతంపేట మండలాలకు చెందిన ఆదివాసీ భక్తులు పాల్గొన్నారు. –భామిని

స్థల పరిశీలన



కాట్రగడ ఓపెన్ హెడ్ చానల్ వద్ద ఇసుక ర్యాంప్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భామిని: మండలంలోని వంశధార ఓపెన్ హెడ్ చానల్ వద్ద (కాట్రగడ – బి) ఇసుక ర్యాంప్ నిర్వహణకు అనువైన స్థలాన్ని అధికారులు ఆదివారం పరిశీలించారు. వంశధార ప్రాజెక్ట్ డీఈఈ భవానీశంకర్, ఏఈ జగదీష్, మైన్స్ ఆర్ఐ, మండల సర్వేయర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో వంశధార తీరంలో ఇసుక లభ్యతపై ఆరా తీశారు. సైడ్ వియ్యర్ నుంచి ఎస్కేప్ కెనాల్‌లో పేరుకుపోయిన ఇసుక మేటలను తీయించడానికి అనువైన స్థలం గుర్తించినట్లు వంశధార ఇంజినీర్లు తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నది అవల గల ఒడిశా ప్రాంతాలకు ఇబ్బంది లేకుండా ర్యాంప్ నిర్వహణకు స్థలం ఎంపిక చేశామన్నారు.

ఘనంగా కోత పండుగ



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని రావాడ రోడ్డు జంక్షన్ సమీపంలో ఉన్న గుడ్ సమారిటన్ లూథరన్ చర్చిలో ఆదివారం కోత పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ రెవరెండ్ డి.రాజు బైబిల్‌లో కోత పండుగకు సంబంధించిన వాక్యాలను వినిపించారు. దేవుడు చేయుచున్న మేలుకు కృతజ్ఞతగా ప్రథమ ఫలములు ఆయనకు అర్పిస్తూ ఈ పండుగను చేసుకుంటారని తెలిపారు. సమస్త శ్రేయస్సు నిమిత్తం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సంఘస్తులంలందరి పేర్లతో లక్కీ డ్రా తీసి విజేతలకు బైబుల్, చీరలను అందజేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు డి.రాజారత్నం, డి.ప్రదీప్, కె.సుదర్శన్, డి.విజయ్‌కుమార్, డి.జాన్ పాల్గొన్నారు.

నిమిషాల వ్యవధిలో..



ఖరీఫ్ చివరి దశలోనూ అన్నదాతలు సాంకేతికతపై ఆధారపడుతున్నారు. గతంలో నవంబర్ నెలలో ఎక్కడ చూసినా వ్యవసాయ కూలీలు బిజీబిజీగా కనిపించేవారు. ఓ వైపు కోతలు, మరోవైపు మోతలు, ఇంకోవైపు నూర్పిళ్లు ఇలా సందడి వాతావరణం కనిపించేది. ఇప్పుడా పరిస్థితి లేదు. నిమిషాల వ్యవధిలో కోత, నూర్పిడి పూర్తి చేసి ధాన్యం రాశిని ముందుంచే యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఎకరా పంటను కేవలం 50 నిమిషాల వ్యవధిలో కోత చేపట్టి వరి ధాన్యం రైతులకు అందిస్తున్నారు. ఇందుకు రూ.2500 నుంచి 2,800 వరకు సదరు యంత్ర యజమాని తీసుకుంటున్నారు. పాత పద్ధతిలో ఈ ప్రక్రియకు వారం రోజులు పట్టేది. ఖర్చు దాదాపుగా రూ.8 వేలు వరకు అయ్యేదని రైతులు చెబుతున్నారు. మండల పరిధిలో అధిక శాతం మంది రైతులు ఆదివారం యంత్రాల సాయంతో నూర్పుళ్లు చేశారు.

పాలకొండ రూరల్